## చందానగర్‌లో రూ.28,09,519 నగదు పట్టివేత



పట్టుబడిన నగదు

కొండాపూర్, అక్టోబర్ 24 : చందానగర్‌లో చేపట్టిన వాహన తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడింది. ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి కథనం ప్రకారం.. ఎన్నికల కోడ్‌లో భాగంగా మంగళవారం చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని గంగారం కూడలిలో వాహనాల తనిఖీ చేపట్టారు. డి. రవికుమార్ రూ. 28,09,519 నగదుతో వెళ్తున్నాడు. సరైన పత్రాలు చూపకపోవడంతో అతడి వద్ద నుంచి నగదును సీజ్ చేసినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ నగదును ఆదాయపన్ను శాఖ అధికారులకు అందజేసినట్లు తెలిపారు.

## 82 కిలోల గంజాయి సీజ్

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 24: కారులో తరలిస్తున్న 82 కిలోల గంజాయిని సోమవారం రాత్రి పేట్‌బషీరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇద్దరు వ్యక్తులు కారులో సుచిత్ర సర్కిల్ మీదుగా మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్నట్లు పేట్ బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో దూలపల్లి చౌరస్తా వద్ద నిఘా పెట్టిన పోలీసులు.. కారును ఆపి తనిఖీ చేశారు. ఆ కారులో 82 కిలోల గంజాయి లభించింది. కారుతో పాటు గంజాయిని సీజ్ చేశారు. నిందితులు అమర్‌నాథ్(21), సంజీవ్(25)ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

## శ్రమజీవులను సత్కరించిన 'రైతునేస్తం'




సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): యజమాని ఎదుగుదలలో ఉద్యోగుల పాత్ర కీలకమని, ఇది గమనించిన రైతు నేతస్తం అధినేత, పద్మశ్రీ పురస్కార గ్రహీత వెంకటేశ్వరరావు తన ప్రింటింగ్ ప్రెస్ శ్రమజీవులను సత్కరించారు. దసరా పండుగను పురస్కరించుకొని మంగళవారం అలయ్ బలయ్ పేరుతో రెడ్‌హిల్స్‌లోని ఫిక్కి సురనా ఆడిటోరియంలో ప్రత్యేక ఆత్మీయ వేడుక ఏర్పాటు చేశారు. ఉద్యోగులకు నూతన వస్త్రాలు పెట్టి సంప్రదాయ పద్ధతిలో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఇంద్రజాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమానికి హైదరాబాద్ కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ డీపీ నాయుడు, ప్రముఖ న్యాయవాది పి.విష్ణువర్ధన రావు హాజరయ్యారు.

## జూనియర్ ఆర్టిస్టును మోసం చేసిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్, అక్టోబర్ 24: పెళ్లి చేసుకుంటానంటూ జూనియర్ ఆర్టిస్టును నమ్మించి.. మోసం చేయడంతో పాటు వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 2లోని ఇందిరానగర్‌లో నివాసముంటున్న యువతి (29) సినిమాల్లో జూనియర్ ఆర్టిస్టుగా పనిచేస్తున్నది. ఆరేళ్ల కిందట ఆమెకు ఫయాజ్ అలియాస్ మాసన్ ఖాన్(35) అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ప్రేమిస్తున్నానంటూ నమ్మించి ఆమెకు దగ్గరయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు ఆమెను లోబర్చుకున్నాడు. దీంతో ఆమె గర్భవతి కావడంతో తనను పెళ్లి చేసుకోవాలని నిలదీసింది. సమీపంలోని మసీదుకు తీసుకువెళ్లి దండలు మార్చుకుని పెళ్లి చేసుకున్నాడు. కొన్నాళ్లకు ఇప్పుడే పిల్లలు వద్దంటూ అబార్షన్ చేయించాడు. ఆ తర్వాత 2021లో ఆమెకు పాప పుట్టింది. గత కొన్ని నెలలుగా బాధితురాలిని అనేక రకాలుగా వేధింపులకు గురిచేయడంతో పాటు ఇంటికి రావడం మానేశాడు. తనను మోసం చేయడంతో పాటు వేధింపులకు గురిచేస్తున్న ఫయాజ్‌పై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఆధారాలు లేకుంటే నగదు సీజ్ చేస్తాం

### తనిఖీల్లో రూ.6 లక్షలు సీజ్

### జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్

సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సందర్భంగా నగరంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.6,72,430 నగదును సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ద్వారా ఇప్పటి వరకు 1,51,01,800 నగదును సీజ్ చేశామన్నారు. పోలీస్ అథారిటీ ద్వారా రూ.67,60,431 సీజ్ చేయగా.. ఇప్పటి వరకు రూ. 38,97,87,286 నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. 315 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. లా అండ్ ఆర్డర్ కింద లైసెన్స్ ఆయుధాలను ఇప్పటి వరకు 4,416 రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 5,090 చోట్ల వాల్ రైటింగ్, 70,145 పోస్టర్లు, 22,764 బ్యానర్లను తొలగించారని పేర్కొన్నారు. 75,604 నాయకుల విగ్రహాలకు మాస్కులు అమర్చడంతో పాటు ప్రైవేట్ ప్రాపర్టీల్లో 19,105 పోస్టర్లను తొలగించినట్టు వివరించారు. ఇప్పటి వరకు 20,384 విగ్రహాలకు మాస్కులు వేయడంతోపాటు అనుమతి లేకుండా నిర్వహిస్తున్న సమావేశాలపై 14 కేసులు నమోదయ్యాయని ఆయన వెల్లడించారు.

### రూ.50 లక్షలు పట్టివేత

కాచిగూడ, అక్టోబర్ 24: ఎలాంటి ఆధారాలు లేకుండా పెద్ద మొత్తంలో నగదును తరలిస్తే సీజ్ చేస్తామని ఈస్ట్ జోన్ డీసీపీ సునీల్‌దత్ హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని కాచిగూడ ఏసీపీ కస్తూరి శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు నేతృత్వంలో ఎస్సై హెచ్.నరేశ్ ఆధ్వర్యంలో మంగళవారం నింబోలి అడ్డా ప్రాంతంలో కాచిగూడ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఆదిబట్లకు చెందిన పల్లె రజినీకాంత్‌గౌడ్, సీహెచ్. యాదగిరేందర్, విజయ్‌కుమార్, అశోక్ కారులో రూ.50 లక్షలు తీసుకెళ్తూ పోలీసులకు పట్టుబడ్డారు.ఆ డబ్బుకు సంబంధించిన ఆధారాలు చూపాలని ఎస్సై నరేశ్ కోరగా.. ఆ నగదును భూమి కొనుగోలు కోసం తీసుకెళ్తున్నామంటూ పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో పోలీసులు రూ.50 లక్షల స్వాధీనం చేసుకొని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డీసీపీ ఆదేశాల మేరకు ఆదాయ పన్ను శాఖకు నగదును అప్పగించినట్లు కాచిగూడ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



పట్టుబడ్డ రూ.50 లక్షలు చూపిస్తున్న కాచిగూడ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణ రాజు, ఎస్ఐ నరేశ్

# మేడ్చల్ బీజేపీలో ముసలం

### కొందరి కబంధ హస్తాల్లో బీజేపీ • బీసీ నేత ధిక్కార స్వరం

### • తనకే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని డిమాండ్



నూనె ముంతల రవీందర్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి, మేడ్చల్

మేడ్చల్, అక్టోబర్ 24 : మేడ్చల్ నియోజకవర్గ బీజేపీలో ముసలం పుట్టింది. బీసీ నేతలకు 20 ఏండ్ల నుంచి అన్యాయం జరుగుతున్నదని, నియోజకవర్గంలో పార్టీ కొందరి కబంధ హస్తాల్లో నడుస్తున్నదని ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. ఈసారి బీసీలకు న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. సామాజిక మాధ్యమాలు వేదికగా తన ఆవేదన తెలిపారు. ఈ విషయం మేడ్చల్ నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలోని శామీర్‌పేట మండలానికి చెందిన బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి నూనెముంతల రవీందర్ గౌడ్ తనకే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. నియోజకవర్గంలో 20 ఏండ్ల నుంచి బీజేపీ కొందరి కబంధ హస్తాల్లో నడుస్తున్నదన్నారు. పెద్ద ఎత్తున బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉన్నప్పటికీ న్యాయం చేయడం లేదన్నారు. పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు మొత్తం ఒక సామాజిక వర్గానికే ఇస్తున్నారని మండిపడ్డారు. ఇప్పుడు బీజేపీ తెలంగాణలో బీసీ వాదం తీసుకున్నదని, బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. ఈ మేరకు మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ను, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరినట్టు తెలిపారు. బీజేపీలో తాను 15 ఏండ్లుగా పని చేస్తున్నానని, ఎన్నో రకాల పదవులు తీసుకొని, ప్రతి పదవికి న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేశానన్నారు. గుర్రంపోడు పోరాటంలో సుమారు 40 రోజులు జైలుకు వెళ్లినట్టు తెలిపారు. పార్టీ కోసం పని చేస్తున్న బీసీ బిడ్డను.. తనను అభ్యర్థిగా ప్రకటించాలంటూ ఆ పార్టీ అధిష్టానాన్ని కోరారు. పార్టీ పెద్దలు ఈ విషయాన్ని ఆలోచించి, తనకు లేదా బీసీలకు మేడ్చల్ టికెట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# వృద్ధురాలు ఒంటరిగా ఉన్నదని..చోరీ

### చోరీకి పాల్పడిన పనిమనిషి

- 24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు
- 47 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- ఇద్దరు మహిళలు రిమాండ్

మెహిదీపట్నం, అక్టోబర్ 24 : విజయనగర్ కాలనీలో చోరీ కేసును హుమాయూన్‌నగర్ పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. ఇంట్లో వృద్ధురాలు ఒంటరిగా ఉండటాన్ని గమనించిన ఓ పనిమనిషి చోరీకి పాల్పడినట్లు గుర్తించి అదుపులోకి తీసుకొని 47 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దొంగతనం చేసిన పని మనిషితో పాటు ఆమెకు సహకరించిన మరో పని మనిషిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు హుమాయూన్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సైదేశ్వర్, అదనపు ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణతో కలిసి వివరాలు వెల్లడించారు. మెహిదీపట్నం విజయనగర్‌కాలనీలో నివాసముండే వృద్ధురాలు గృహలక్ష్మి ఒంటరిగా ఉంటుంది. ఆమె ఇంట్లో గతంలో కోటమ్మ బస్తీకి చెందిన నందిపటి సునీత(30)పని పనిషిగా చేసి నెల రోజుల కిందటే మానేసింది. అక్టోబర్ 22న గృహలక్ష్మి ఇంటికి సునీత తనతో పాటు మరో మహిళ పుష్ప (35)ను తీసుకువచ్చింది. గృహలక్ష్మి స్నానానికి వెళ్లగానే అల్మారాలో దాచిన సుమారు 47 తులాల బంగారు ఆభరణాలను దోచుకొని పారిపోయారు. స్నానం పూర్తి చేసుకొని వచ్చిన గృహలక్ష్మి అల్మారా తెరిచి ఉండటాన్ని చూసి తన కుమారుడికి తెలిపింది. వెంటనే హుమాయూన్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సునీతపై అనుమానంతో మెహిదీపట్నంలో పట్టుకొని విచారించగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నది. మంగళవారం ఆమె వద్ద నుంచి 47 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు సునీత, పుష్పను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న హుమాయూన్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదేశ్వర్

## బీఆర్ఎస్ పార్టీతోనే కార్మిక సంఘాలు

### బీఆర్ఎస్ కేవీ రాష్ట్ర కార్యదర్శి సందీప్‌సింగ్



బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డితో సమావేశమైన కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శి సందీప్‌సింగ్

మల్కాజిగిరి, అక్టోబర్ 24: రాష్ట్రంలోని కార్మిక సంఘాలన్నీ బీఆర్ఎస్ పార్టీతోనే ఉన్నాయని రాష్ట్ర కార్మిక విభాగం కార్యదర్శి సందీప్ సింగ్ అన్నారు. మంగళవారం బోయిన్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో మల్కాజిగిరి అసెంబ్లీ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డితో సందీప్‌సింగ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సందీప్ సింగ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోను అమలు పరుస్తామన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేయడంతో చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు నిరంతరం పనిచేయడం వల్ల కార్మికులకు ఉపాధి దొరుకుతున్నదన్నారు. కార్మికుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఆటో, డీసీఎం కార్యికులకు ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వ బీమా వర్తింపచేస్తుందన్నారు. అరుంధతి ఆస్పత్రిలో ఉచితంగా చికిత్స అందజేస్తున్నారని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి మర్రి రాజశేఖర్ రెడ్డిని గెలిపించాలని కోరారు.